




నగరోత్సవంలో కళాకారుల సందడి

# సాయినాథ్ మహరాజ్‌కీ జై

## అంబరాన్నంటిన గురుపౌర్ణమి సంబరాలు





వేమన టెలిఫోన్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

అనంతపురం కల్చరల్, జూలై 21: జిల్లావ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గురువులకు గురువుగా భావించే కొలిచే షిర్డీ సాయిబాబా ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో సాయినామస్మరణ ప్రతిధ్వనించింది. స్వామివారికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, కాగడ హారతులు, పల్లకీసేవలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాదిమందికి అన్నదానం చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో సాయినాథున్ని కొలువుదీర్చి బాణసంచా పేలుళ్ల, కళాకారుల విన్యాసాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. పౌర్ణమి నేపథ్యంలో ప్రతి ఆలయంలోనూ సామూహిక సాయిసత్యవ్రతాలను విశేషంగా నిర్వహించారు. అదేవిధంగా చాలా ఆలయాలవద్ద పెద్ద ఎత్తున అన్నదాన వినియోగాలు చేశారు.





3వ రోడ్డు సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి అలంకరణ.. దర్శనానికి బారులుదీరిన భక్తులు



మారుతీనగర్ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి పుష్పార్చన



రామచంద్రనగర్ సాయినాథ మందిరంలో ప్రత్యేక అలంకరణ..



రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డు సాయిబాబా ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

## విద్యుత్ శాఖ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ





ఎస్ఈకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న అధికారులు, ఉద్యోగులు

అనంతపురంరూరల్, జూలై 21: ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈగా సంపత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్‌శాఖ ప్రధానకార్యాలయంలో ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈనెల 19న విద్యుత్‌శాఖ ఎస్ఈగా ఆయనను నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఈయన గతంలో ఉమ్మడిజిల్లాలో కదిరి ఏఈగా పనిచేశారు. అలాగే గుంతకల్లు, హిందూపురం ఏడీఈగా పనిచేశారు. ఆ తరువాత అనంతపురం ట్రాన్స్‌ఫార్మర్స్ ఆపరేషన్ డీఈగా పనిచేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణకు కేటాయించబడ్డారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు తిరిగి ఏపీఎస్పీడీసీఎల్‌కు కేటాయించారు. తిరుపతి ప్రధాన కార్యాలయంలో ఈఈగా పనిచేస్తూ ఉద్యోగ్నతి పొంది ఇక్కడకు బదిలీ అయ్యారు. ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ఈఈలు శ్రీనివాసులు, వివేకానంద స్వామి, రామకృష్ణ, ఏఈ గంగన్న, ఫోర్‌మెన్ గోపాల్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్ఈ సంపత్ కుమార్ మాట్లాడుతూ సొంత జిల్లాలో ఎస్ఈగా పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. గతంలోను చాలా ప్రాంతాల్లో వివిధ కేడర్లలో పనిచేసినట్లు వెల్లడించారు. జిల్లా పరిస్థితులపై పూర్తిగా అవగాహన ఉందని, సహచర అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తామన్నారు.

ఆదర్శనగర్‌లో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఆక్రమించిన స్థలంలో వేసిన షెడ్డు



# సర్వే చేసేదెవరు..?

అనంతపురం నగరపాలికలో ప్రభుత్వ సర్వేయర్ లేకపోవడంతో భూ సమస్యలున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదిగా సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. ఈక్రమంలో ఇరుగు పొరుగు వారి మధ్య స్థల వివాదాలు గొడవలకు దారి తీస్తున్నాయి. సర్వే చేసి ఎవరి హద్దు ఎక్కడి వరకు ఉందో చెప్పేవారు లేరు. ఇలాంటి చిన్న చిన్న వ్యవహారాలు నగరంలోని ప్రతి డివిజన్లోనూ ఉండేవే. నగరంలో ఆక్రమించిన భూములు, పొరంబోకు భూముల సంగతి లెక్కే లేదు. వీటిన్నింటిని పరిష్కరించాలంటే ఇద్దరు, ముగ్గురు సర్వేయర్ల అవసరమవుతారనే వాదన వినిపిస్తోంది. నగరపాలికలో ఇంత అధ్వాన పరిస్థితి ఉంటే ఎవరికీ పట్టకపోవడం గమనార్హం. తాజాగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో సమస్యలు పరిష్కరించలేని పక్షంలో చిన్న మున్సిపాలిటీకి వెళ్లిపోవచ్చని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నగర కమిషనర్‌కు చురకలంటించిన విషయం తెలిసిందే. నగరంలో ఆక్రమణలను త్వరగా తొలగించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. 50 డివిజన్లు, రూ.4.5లక్షల జనాభా కలిగిన పెద్ద నగరానికి సర్వేయర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- అనంతపురం క్రైం

- నగరపాలికలో ఏడాదిగా సర్వేయర్ పోస్టు ఖాళీ
- వివాదాల్లో అనేక స్థలాలు
- ఓపెన్‌సైట్‌లు, పొరంబోకు స్థలాల ఆక్రమణ
- ఎమ్మెల్యే ఫిర్యాదుతోనైనా సర్వేయర్ వస్తారా..?
- చిన్న చిన్న వివాదాలతో నగర ప్రజలు సతమతం
- సర్వే శాఖకు విన్నవించుకున్నా నియమించలేని దుస్థితి

### ఆక్రమణలో ఓపెన్‌సైట్‌లు, పొరంబోకు భూములు

నగరంలో ఆక్రమణలకు లెక్కే లేకుండా పోయింది. గత కొన్నేళ్లుగా నగరంలో నగరపాలిక స్థలాలను ఆక్రమిస్తూనే ఉన్నారు. దీనిపై కౌన్సిల్ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాధానం ఇవ్వలేకపోయారు. గతంలో కార్పొరేషన్‌కు సంబంధించి 280 పైచిలుకు ఓపెన్ సైట్‌లు ఉండేవనేది అధికారుల అంచనా. అందులో కొన్నింటిని పాఠశాలలు, ఆలయాలు, కమ్యూనిటీ హాళ్లకు ఇచ్చారు. మిగిలిన వాటిలో చాలా భాగం ఆక్రమించేశారు. ప్రస్తుతానికి 65 స్థలాలకు నగరపాలిక అధికారులు రక్షణ కల్పిస్తున్నట్లు తెలుస్తున్నారు. 20స్థలాలకు పైగా రక్షణ లేనట్లు తెలుస్తోంది. పొరంబోకు స్థలాల విషయంలో ఆక్రమణలకు అంతే లేకుండా పోయిందనే విమర్శలున్నాయి. ఇక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సెంట్రల్ పార్క్ విషయంలో ఆక్రమణలున్నాయనే ఆరోపణలున్నాయి. కానీ ఎంత మంది సర్వేయర్లు తేల్చినా ఎంత భూమి ఆక్రమించారు..?, ఎంత భూమి కార్పొరేషన్‌ది ఉందో తేల్చలేక పోయారు. ఆరెకరాల పైచిలుకు భూమిలో 1.6ఎకరాల భూమి లెక్క తేలలేదని ఏసీపీ చెప్పుకొచ్చారు. ఆ భూమి ఆక్రమించారా..?లేక అలాగే ఉందా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేకపోయారు. నగరపాలిక పరిధిలో పనిచేసిన సర్వేయర్లందరూ సర్వే చేసిన పనులకు పైసలు వసూలు చేయడంలోనే బిజీగా ఉండేవారు. గతంలో కోటేశ్వరరావు అనే సర్వేయర్ రూ.8లక్షలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు.

### ఆక్రమణలపై నిజాలు నిగ్గు తేల్చేదెన్నడు...?

నడిమివంక, మరువవంకల చుట్టూ వందల సంఖ్యలో ఆక్రమణలున్నాయి. వీటిపై ఇప్పటికే 500 మందికి పైగా అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పుడు వాటి గురించి సీరియస్‌గా పట్టించుకుంటున్నారు. వాటితో పాటు నగరంలోని ఆక్రమణలన్నింటిపైనా నిగ్గు తేల్చాలని, ఆక్రమణలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను అనంతపురం ఎమ్మెల్యే ప్రసాద్ కోరారు. దీంతో



వాటిపై విచారణాధికారిగా జేసీని నియమించారు. కానీ ఇక్కడా సర్వేనే అత్యంత కీలకం కానుంది. వంకలను ఎంత దూరం ఆక్రమించారు? ఎన్ని ఇళ్లు కట్టారన్నది తేల్చాలంటే సర్వే తప్పనిసరి. సర్వేయర్ లేకపోవడంతో ప్రస్తుతం అత్యంత కీలకమైన వాటిని అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌తో అధికారుల విజ్ఞప్తి మేరకు సర్వే చేస్తున్నారట. ఇంత దిక్కుమాలిన పరిస్థితి కార్పొరేషన్‌కు గతంలో ఎన్నడూ లేదని తెలుస్తోంది. కాగా జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీ కావడంతో పరిస్థితి ఎప్పటికి చక్కబడుతుందోననే చర్చ మొదలైంది.

### అందరినీ కోరాం: మహమ్మద్ వసీం, నగర మేయర్

నగరపాలక సంస్థలో సర్వేయర్ పోస్టు దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న విషయం వాస్తవమే. నగర ప్రజలు భూ వివాదాలపై సర్వే చేయించాలని కోరుతున్నారు. ఈ సమస్యను నగర కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు అందరి దృష్టికి తీసుకెళ్లాం. టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వేశాఖకు పలు సార్లు లేఖలు రాశారు. అప్పటికీ సర్వేయర్‌ను నియమించలేదు. త్వరలోనే సర్వేయర్‌ను నియమిస్తాం.

### సర్వే శాఖకు విన్నవించుకున్నా...

నగరానికి సర్వేయర్ కావాలని కార్పొరేషన్ అధికారులు ఎన్నోసార్లు సర్వే శాఖకు విన్నవించుకున్నా ఫలితం లేదు. నగర కమిషనర్, మేయర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు చెప్పుకున్నా సర్వేయర్‌ను నియమించలేకపోయారు. ఏకంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్(సర్వే శాఖ)ఉన్నతాధికారికి పలు సార్లు లేఖ రాసినా స్పందన లేదని అధికారులంటున్నారు. దీనికి తోడు నిత్యం ప్రజలు తమ భూమి సర్వే చేయించాలని సర్వేయర్ ఎక్కడున్నారని, చలానా ఎవరికి చెల్లించాలని అడుగుతున్నారు. సర్వేయర్ లేడని దీంతో చలానా కట్టించడం లేదంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులంటున్నారు. దీంతో ప్రజలు చేసేదేమీలేక నిట్టూరుస్తున్నారు.



## వైఎస్ఆర్ గ్రామీణ పార్కు నిర్మాణంలో అవకతవకలు

- కోటిరూపాయలకు పైగా స్వాహా?
- ఐదేళ్లలో పూర్తికాని పనులు
- రూ.50 లక్షలు మాత్రమే ఖర్చుచేసిన వైనం
- మందుబాబులకు అడ్డాగా మారిన పార్కు





మందుబాబుల భయంతో జనాలు రాక బోసిపోయిన పార్కు

# చేసింది కొంతే.. మింగింది ఎంతో?





వైఎస్ఆర్ గ్రామీణ పార్కు ముఖద్వారం

తాడిపత్రి పట్టణ సమీపంలోని పాతబ్రిడ్జి వద్ద పెన్నానది ఒడ్డున గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ గ్రామీణ పార్కు నిర్మాణంలో ఎన్నో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 12 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కుకు రూ.50లక్షలు మాత్రమే ఖర్చుచేసి దాదాపు కోటి రూపాయల మేర నిధులను స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు కూడా అరకొరగానే పూర్తయ్యాయి. పలువురు వైసీపీ నాయకులు నిధులను స్వాహా చేయడమే పనులు పూర్తికాకపోవడానికి ప్రధాన కారణమన్న విమర్శలు ఉన్నాయి. సజ్జలదిన్నె గ్రామంతోపాటు బండల పరిశ్రమల్లో పనిచేస్తున్న కూలీలు, వారి పిల్లలకు సాయంత్రం వేళల్లో ఆహ్లాదం కోసం ఏర్పాటుచేసిన పార్కులో వైసీపీ నాయకుల కాసుల కక్కుర్తి వల్ల పనులు పూర్తికాలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన పలు ఆటవస్తువులు కూడా చాలా నాసిరకంగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వీటితో ఆడుకునేటప్పుడు ఎవరికైనా ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- తాడిపత్రి



పార్కులో వేసిన ఎర్రమట్టి రోడ్డు



పార్కులో ఏర్పాటుచేసిన పిల్లల ఆటవస్తువులు



మందుబాబులు పడేసిన బీరుసీసాలు



పార్కులో కంకర తేలిన తారురోడ్డు

### పంచాయతీ ఫండ్ రూ.26లక్షలు, మండల పరిషత్ ఫండ్ రూ.50లక్షలు

గన్నేవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ గ్రామీణ పార్కు నిర్మాణానికి పంచాయతీ నిధులు రూ.26లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.50లక్షలు మంజూరయ్యాయి. మొదట్లో పనులు చురుకుగా సాగాయి. వచ్చిన నిధులతో పార్కులో రోడ్లు, కంచె నిర్మాణం, చిన్నారులు ఆడుకోవడానికి ఆటవస్తువులు తదితర వాటిని ఏర్పాటుచేశారు. కాలం గడిచే కొద్దీ పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. వేసిన తారురోడ్డుపై ఇప్పటికే కంకర తేలుతోంది. దీన్ని బట్టే ఎంతమేర నాణ్యతప్రమాణాలు పాటించారో అర్థమవుతోంది. మరికొన్నిచోట్ల ఎర్రమట్టితో రోడ్డు వేసి మమ అనిపించారు. చివరికి ఎన్నికలు రావడం పనులు కుంటుపడటంతో పార్కులో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కరువయ్యాయి.

### కోటి రూపాయల నిధులు ఎక్కడ?

పార్కు నిర్మాణానికి తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న సిమెంట్ పరిశ్రమలతో పాటు గ్రానైట్, నల్లబండల పరిశ్రమలు, పలువురు దాతల నుంచి సుమారు రూ.కోటి మేర నిధులు సమకూరినట్లు సమాచారం. ఈ నిధులతో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారని అందరూ అనుకున్నారు. కానీ పంచాయతీ, మండలపరిషత్ మంజూరు చేసిన నిధులలోనే సగం మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన మొత్తం ఏమైందో ఇప్పటికీ లెక్క తేలలేదు. దాతలు ఇచ్చిన కోటి రూపాయలు ఎవరివద్ద ఉన్నాయో అధికారులే తేల్చాల్సి ఉంది.

### పార్కులో పేట్రేగిపోతున్న మందుబాబులు

ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాభవం చెందడంతో పార్కు నిర్వహణ గురించి గాలికి వదిలేశారు. దీంతో మందుబాబులు పేట్రేగిపోతున్నారు. సాయంత్రం అయితే చాలు మద్యం బాటిళ్లను తీసుకొని సిట్టింగ్ వేస్తున్నారు. దీంతో మహిళలు, చిన్నారులు పార్కుకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. మందుబాబుల కారణంగా చాలామంది పార్కుకు రావడం మానేశారు. మందుబాబులు ఎక్కడబడితే అక్కడ మద్యం తాగి సీసాలను పగలగొట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అయినప్పటికీ ఏ అధికారి పట్టించుకోవడం లేదు.

### రూ.కోటి గురించి తెలియదు

నేను ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించాను. వైఎస్ఆర్ గ్రామీణ పార్కుకు సంబంధించి పంచాయతీ, మండలపరిషత్ నిధులు మంజూరైన మాట వాస్తవమే. కానీ దాతల నుంచి కోటి రూపాయలు రావడం గురించి నాకు తెలియదు. విచారించి చర్యలు తీసుకుంటాం.


- నరసింహారావు, ఎంపీడీఓ



# బడ్జెట్ రైలు కూత పెట్టేనా..?

- నిరుత్సాహపరిచిన మధ్యంతర బడ్జెట్
- పూర్తిస్థాయిలోనైనా ప్రాజెక్టులకు విదిలింపులుంటాయా?
- రేపు కేంద్ర బడ్జెట్





**గుంతకల్లు, జూలై 21:** కేంద్ర పూర్తి స్థాయి బడ్జెట్‌లోనైనా కొత్త రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైళ్లు వస్తాయా?, ఉద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలేవైనా ఉంటాయా? అన్న ఆశతో ప్రయాణికులు, రైల్వే ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు పూర్తి స్థాయి బడ్జెట్లను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఫిబ్రవరి 1న గత ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇంటెరిమ్ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఎన్నికల అనంతరం ఎన్డీయే ప్రభుత్వమే ఏర్పాటు కావడంతో ఈనెల 23వ తేదీన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్టులో రైల్వేకు పూర్తిగా మొండిచేయి చూపించారు. కొత్త రైళ్లు, కొత్త ప్రాజెక్టుల ఊసే లేకుండా, రైల్వే ఉద్యోగులకు, ప్రయాణికులకు ఏమాత్రం తాయిలాలు లేకుండా కేంద్ర బడ్జెట్టును తెచ్చారు. కనీసం ఈదఫా బడ్జెట్టులోనైనా అయినా గుంతకల్లు రైల్వే డివిజన్‌కు మేలు జరుగుతుందా? అని స్థానికులు ఎదురుచూస్తున్నారు.




## ఈ ప్రాజెక్టులకు నిధులు వచ్చేనా.?

గుంతకల్లు రైల్వే డివిజన్ అవసరాల కోసం, రైల్వే క్వార్టర్సుకు తాగునీటిని సమకూర్చడానికి అదనపు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి నిర్ణయించారు. కానీ నిధుల కొరత కారణంగా రైల్వే ఎస్ఎస్ ట్యాంకు పనులు నిలిచిపోయాయి. ఈ ఎస్ఎస్ ట్యాంకుకు నిధులు లభించాల్సి ఉంది. కడప-బెంగళూరు మధ్య రూ. 2,706 కోట్లతో చేపట్టిన కొత్తలైన్ నిర్మాణం నత్తనడకన నడుస్తోంది. శ్రీకాళహస్తి-నడికుడి లైన్ నిర్మాణానికి రూ. 2,289 కోట్లతో మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. గుంతకల్లులో ట్రాక్షన్ షెడ్ నిర్మాణంలో భాగంగా పాక్షికంగా పనులు పెండింగులో ఉన్నాయి. ఈ షెడ్ సంపూర్తిగా ఉన్నా, పూర్తయిన భాగాలను వినియోగంలోకి తెచ్చారు. విజయవాడ-గూడూరు మధ్య 3వ లైన్ నిర్మాణానికి 2016-17లో రూ. 3,549 కోట్లతోనూ, అంకోలా-డోన్ మధ్య కొత్త లైన్‌కు అనుమతులు లభించినా నిధులు విడుదల చేయలేదు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 1, 2, 3 ప్లాట్‌ఫారాలను ఇతర ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేసే పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు నిధులు ఏమాత్రం విడుదల కాలేదు. రైల్వే డివిజన్‌లోని గూడూరు-రేణిగుంట, రేణిగుంట-తిరుపతి సెక్షన్లలో అదనపు లైన్ కోసం ఇంటెరిమ్ బడ్జెట్టులో అరకొరగానూ. 5.50 కోట్లను కేటాయించారు. ధర్మవరం-పాకాల-కాట్పాడి సెక్షన్‌లో డబ్లింగ్, అంకోలా-డోన్ లైన్ డబ్లింగ్‌కు తక్కువ నిధులను ఇచ్చారు. గుత్తి-పెండేకల్లు లైన్ డబ్లింగ్‌కు గత బడ్జెట్టులో అరకొర నిధులు వచ్చాయి.

## ట్రాక్ అభివృద్ధిపైనే దృష్టి?

మిషన్ రఫ్తార్ కార్యక్రమం కింద రైళ్ల వేగాలను పెంచడానికి కేంద్రం ప్రణాళికను రూపొందించినా, పథకం సరిగా కార్యరూపం దాల్చ లేకపోయింది. గరిష్టంగా 160 కి.మీ.ల వేగంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపడానికి ట్రాక్ రెన్యూవల్, లైన్ల విద్యుద్దీకరణ, సింగిల్ లైన్లను డబ్లింగ్ చేయడం, డబుల్ లైన్లను ట్రిపుల్ చేయడం, తదితర చర్యలను చేపట్టారు. కానీ రైల్వే శాఖ 160 కి.మీ.లతో రైళ్లను నడపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా అమలులోకి వచ్చేసరికి ఘోరంగా విఫలమయ్యారు. రైళ్ల ప్రమాదాలు పెచ్చుమీరడంతో పలు రూట్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, హంసఫర్ తదితర ప్రీమియం రైళ్ల వేగాలను కూడా గంటకు 130 కి.మీ.లకు తగ్గించేశారు. రైళ్ల వేగాలకు అనుగుణంగా ట్రాక్ నాణ్యతగా లేకపోవడం కారణంగా భావిస్తున్నారు. ఈ వైఫల్యాలను అధిగమించడానికి ట్రాక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పై రైల్వే శాఖ దృష్టిపెట్టే అవకాశాలు, బడ్జెట్టులో గరిష్టంగా ట్రాక్‌లకు వెచ్చించే పరిస్థితులు ఉన్నాయి.

రైల్వే ఉద్యోగులు ఎన్నాళ్లనుంచో పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. 8వ పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. పెండింగులో ఉన్న అలవెన్సులను ఇవ్వాలని, రద్దైన అలవెన్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇంటెరిమ్ బడ్జెట్‌లో కొన్నింటికైనా గ్రీన్ సిగ్నల్ లభిస్తుందని ఎదురుచూసిన రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశే ఎదురైంది. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా ప్రయోజనాలు కలిగిస్తారా? అని ఎదురు చూస్తున్నారు. అలాగే సీనియర్ సిటిజన్లకు గతంలో రైలు చార్జీల్లో రాయితీ లభించేది. కరోనా కాలం నుంచి వృద్ధులకు రాయితీ నిలిపివేశారు. 58 ఏళ్ల

## తాయిలాలు అందేనా..?

దాటిన పురుషులకు రైలు టిక్కెట్టు ధరలో 40 శాతం, స్త్రీలకు 50 శాతం రాయితీని ఇచ్చేవారు. ఆ రాయితీని కనీసం ఈ సారి బడ్జెట్‌లోనైనా పునరుద్ధరించాలని ఎదురుచూస్తున్నారు. రాయితీ లేనప్పుడు రైల్వేకు సీనియర్ సిటిజన్ ద్వారా దాదాపు రూ. 3 వేల కోట్ల ఆదాయం వచ్చేది. రాయితీని రద్దుచేశాయ ఆ ఆదాయం రూ. 5,062 కోట్లకు పెరిగింది. నికరంగా రూ. 2,242 కోట్ల అదనపు లాభం వచ్చినట్లు రైల్వే గణాంకాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వృద్ధులకు టిక్కెట్టు రిబేటు విషయంగా ఏంచేస్తారన్న విషయంగా సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది

### కరోనాలో ఆగిన రైళ్లను పునరుద్ధరించాలి..
### వలిబాషా, గుంతకల్లు



కరోనా సమయంలో రైల్వే శాఖ నిలిపివేసిన ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను పునరుద్దరించాలి. తగినన్ని రైళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు-గుల్బర్గా ప్యాసింజర్ రైళ్లను వెంటనే పునప్రారంభించాలి. గుంతకల్లు-హైదరాబాదు మధ్య కొత్త రైలును వేయాలి. హైదరాబాదుకు సరైన రైళ్లు లేక గుంతకల్లు, పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురౌవుతున్నారు.

### విజయవాడకు కొత్త రైలు వేయాలి..
### జగన్నాథ్, వ్యాపారి, గుంతకల్లు



గుంతకల్లు-విజయవాడ మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలి. అలాగే బెంగళూరు-విజయవాడ ప్యాసింజర్ రైలును పునరుద్దరించాలి. విజయవాడకు రైలు లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యాపారస్థులకు కూడా విజయవాడకు కొత్త రైళ్లు అవసరం. రాజధానికి కేవలం రెండు రైళ్లు మాత్రమే ఉన్నాయి.

### ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలి..
### శేఖర్‌బాబు, మజ్దూరు యూనియన్ ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యదర్శి, గుత్తి



కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన 8వ వేతన సవరణ సంఘాన్ని(పీఆర్సీ)వెంటనే ఏర్పాటు చేయాలి. 8వ పీఆర్సీ సకాలంలో ఏర్పాటు చేయని కారణంగా కేంద్ర ఉద్యోగులు నష్టపోతున్నారు. అదే విధంగా కరోనా సమయంలో కేంద్ర ఉద్యోగులకు పెంగింగ్‌లో ఉంచిన 18నెలల డీఏను చెల్లించేలా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించాలి. పాతపెన్షన్ విధానంతో పాటు పెంగింగ్ అలవెన్స్‌ల విషయంగా బడ్జెట్ సమావేశంలో ప్రకటన చేయాలి.

### సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ ఇవ్వాలి..
### షేక్ గౌసమొద్దీన్, గుంతకల్లు



వృద్ధులకు గతంలో ఉన్న రైల్వే టికెట్ రాయితీలను పునరుద్ధరించాలి. సీనియర్ సిటిజన్‌కు ఈ రాయితీ తొలగించడం వల్ల ఆర్థిక ఇబ్బందులు కలుగుతున్నాయి. సీనియర్ సిటిజన్‌లో స్త్రీలకు 50శాతం, పురుషులకు 40శాతం టికెట్ రాయితీని బడ్జెట్‌లో ప్రకటించాలి. వృద్ధులకు చేయూత నివ్వడం ప్రభుత్వ బాధ్యత. కరోనా పేరుతో రాయితీ ఆపేయడం సరికాదు.



## ఘర్షణలో నలుగురికి గాయాలు
### ఒకరి పరిస్థితి విషమం



గాయపడ్డ యువకుడు



ధ్వంసమైన బైక్

**శింగనమల జూలై 21:** మండలంలోని జూలా కాలువలో మొహరం పండుగ రోజు చిన్నపాటి గొడవ రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ సంఘటనలో నలుగురు గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. శింగనమల పోలీసులు, గ్రామస్తులు అందించిన వివరాల మేరకు జూలాకాలువ గ్రామంలో గురువారం రోజు మొహరం సందర్భంగా అదే గ్రామానికి చెందిన మరికొందరి యవకులు శింగనమల చెందిన యువకుల మధ్య పీర్ల ఉరేగింపులో చిన్నపాటి గొడవ జరిగింది. శింగనమల, జూలాకాలువ గ్రామాల యువకులు గ్రామంలోని వీధులలో బైకులు తిప్పడంతో ఆ గ్రామానికి చెందిన ఒక యువకుడి తండ్రి నాగప్ప జూలాకాలువకు చెందిన ఇద్దరు యువకులను కొట్టాడు. అప్పటితో ఆ గొడవ సద్దుమణిగింది. శుక్రవారం రాత్రి నాగప్ప కుమారుడు శింగనమల మరువకొమ్మ వద్ద ఉండగా శింగనమలకు చెందిన కొందరు అతనిని కొట్టి పంపించారు. అదే రోజు రాత్రి తిరిగి తన కూమారుడు ఎందుకు కొట్టారని శింగనమల యువకుడు బంధువులు ఇంటి వద్ద గొడవపడ్డారు. అయితే జూలాకాలువ గ్రామానికి చెందిన యవకులు శింగనమలకు చెందిన యువకుడికి సమాచారం ఇవ్వడంతో ఆ యువకుడు అనంతపురం, శింగనమల నుంచి 20 మంది యువకులను తీసుకువచ్చి జూలాకాలువకు శనివారం రాత్రి వెళ్లాడు. గ్రామంలో అడ్డువచ్చిన నాగప్పతోపాటు మరో ముగ్గురిపై దాడి చేశారు. అప్రమత్తమైన గ్రామస్థులు ఆ యువకులపై తిరగబడ్డారు. అక్కడున్న రెండు బైకులను ధ్వంసం చేసి నరసింహులు, దాదు, నందకిశోర్, ముని అనే యువకులను చితకబాదారు. నరసింహులు అనే యువకుడిపై రాళ్లతో దాడి చేయడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతనిని 108లో అనంతపురం ఆసుపత్రి తరలించారు. నరసింహులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం గ్రామస్థులను విచారించి 8 మంది యువకులపై కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ధర్మవరం వాసి మృతి
### శోకసంద్రంలో కుటుంబం



గజ్జల శివయ్య (ఫైల్)

**ధర్మవరం, జూలై 21:** ఒంగోలు జిల్లా మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెం వద్ద ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణానికి చెందిన గజ్జల శివయ్య(43) మృతి చెందాడు. శివయ్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుండేవారు. ఉద్యోగ నిమిత్తం ఒంగోలు వెళ్లారు. ఓల్వో బస్సులో ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. బస్సు మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెంకు తెల్లవారుజామున 3గంటలకు చేరుకుంది. అక్కడ గేదె అడ్డురావడంతో తప్పించబోయి బస్సు బోల్తాపడినట్టు తోటి ప్రయాణికులు పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గజ్జల శివయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గజ్జల శివయ్య ప్రస్తుతం అనంతపురంలో నివాసముంటున్నాడు. ఈయనకు భార్య సువర్ణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## తీసుకున్న పరిహారం వెనక్కు కట్టండి

- రెండేళ్ల తర్వాత అన్నదాతలకు నోటీసులు
- లబోదిబోమంటున్న మిర్చి, పత్తి రైతులు
- కోర్టును ఆశ్రయించే ఆలోచన



నోటీసులు చూపుతున్న రైతులు

**విడపనకల్లు, జూలై 21:** పంట నష్టపరిహారం కింద తీసుకున్న సొమ్ము వెనక్కు కట్టాలంటూ మండలంలోని పలువురు రైతులకు శనివారం నోటీసులు జారీ అయ్యాయి. దీంతో లబోదిబోమంటూ ఆ రైతులు కోర్టును ఆశ్రయించేందుకు ఆదివారం ఉరవకొండకు వెళ్లారు. వివరాలు ఇలా.. 2020-21వ సంవత్సరం ఖరీఫ్‌లో మిరప, పత్తి సాగుచేసి నష్టపోయిన రైతులకు అప్పటి వైసీపీ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. మిరపకు ఎకరాకు రూ. 60వేలు, పత్తికి ఎకరాకు రూ.30వేలు ప్రకారం నష్ట పరిహారాన్ని మంజూరు చేసింది. అయితే డొనేకల్లు గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు తమ గ్రామంలో మిరప పంటలు సాగు చేయని రైతులకు పరిహారం ఇప్పించారని, వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాలో అవినీతి జరిగిందని కొందరు లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారు. ఒక్క డొనేకల్లు గ్రామంలోనే అనర్హులైన రైతులకు రూ. ఐదు కోట్లకు పైగా పరిహారం ఇచ్చారని, నిజంగా నష్టపోయిన రైతులకు పరిహారం దక్కలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో నవంబరు 18, 2022న ఇన్‌పుట్స్ జేడీఏ డొనేకల్లు గ్రామం చేరుకుని విచారణ చేశారు. అర్హతలేని 15 మంది రైతులు రూ. 10.39లక్షల పరిహారం తీసుకున్నారంటూ విచారణాధికారి ఏకపక్షంగా నోటీసులు జారీ చేశారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అదనంగా తీసుకున్న మొత్తం రూ. 10.39లక్షలు తిరిగి చెల్లించాలని ఈ నెల20న నోటీసులు జారీచేశారు. దీంతో డొనేకల్లు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం ఉదయమే ఉరవకొండ చేరుకుని కోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేశారు. టీడీపీ సానుభూతిపరులైన రైతులకు లక్షల్లో రికవరీకి ఆదేశాలు జారీ చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### దిగుబడి అస్సలు లేదు : గోవిందప్ప, రైతు, డొనేకల్లు



నేను ఆరు ఎకరాల్లో మిరప, నాలుగు ఎకరాల్లో పత్తి పంటలను సాగు చేశా. మిరప పంటకు తెగుళ్ల సోకటం, అధిక వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని ఎకరాకు ఒక్క క్వింటా కూడా దిగుబడి రాలేదు. రూ. 10లక్షలకుపైగా పెట్టుబడి నష్టపోయా. ఆరు ఎకరాలకు పంట నష్ట పరిహారం వస్తే రూ.3 లక్షలు తిరిగి చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు.

### రూ. 1.5లక్షలు కట్టాలట: క్రిష్టప్పపత్తి రైతు, డొనేకల్లు



పదెకరాల్లో మిరప, పత్తి పాగు చేశా. రెండు పంటలు పూర్తిగా దెబ్బతిని పెట్టుబడి కూడా రాలేదు. పరిహారం రావటంతో కొంత ఊపిరి పీల్చుకున్నా. రెండేళ్ల తరువాత రూ.1.5 లక్షలు తిరిగి కట్టాలని నోటీసు జారీ చేశారు. మరీ ఇంత పక్షపాతమా? పంట నష్టంతో అప్పుల పాలైన మాకు నోటీసులు ఇవ్వటం ఏమిటి?

### ఎనిమిది ఎకరాల్లో మిరప నష్టపోయా..
### లక్ష్మన్న, మిరప రైతు, డొనేకల్లు



ఎనిమిది ఎకరాల్లో మిరప పంట నష్టపోయా. లక్షల్లో నష్టం వచ్చింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. అప్పులు ఏవిధంగా తీర్చుకోవాలనుకునే సమయంలో కొంత ఊరటగా నష్ట పరిహారం అందింది. నేను టీడీపీ మద్దతుదారుడినని కక్ష కట్టి నోటీసులు వచ్చేలా చేశారు. రూ. 137వేలు కట్టాలని నోటీసులు అందించారు. ఉరవకొండ కోర్టును ఆశ్రయించేందుకు వెళ్లా.

## ఉరకలేస్తున్న తుంగభద్ర

| | | |
|---|---|---|
| ● టీబీ డ్యాంకి 1.3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో | ● క్రస్ట్‌గేట్లు ఎత్తి 996 క్యూసెక్కుల నీరు నదికి విడుదల | ● క్రమంగా పెంచనున్నట్లు బోర్డు అధికారుల ప్రకటన |



వరదనీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

**బళ్లారి, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** తుంగభద్ర నదికి వరద పోటెత్తుతోంది. విజయనగరం జిల్లా హోస్పేట్ సమీపాన గల తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం) వరద నీటితో కళకళలాడుతోంది. జలాశయం పైభాగంలో కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాంకి ఆదివారం ఇన్‌ఫ్లో 1.30 లక్షల క్యూసెక్కులకు చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 77.377 టీఎంసీల నీరు చేరింది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 1633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1624 అడుగుల మేర నీరు చేరింది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఆదివారం డ్యాం క్రస్ట్‌గేట్లు ఎత్తి నదికి 996 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటి విడుదలను క్రమంగా పెంచనున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డ్యాం నుంచి వివిధ కాలువలకు 3,213 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

### నేడు హెచ్చెల్సీకి నీరు విడుదల

తుంగభద్ర జలాశయం నుంచి సోమవారం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి నీరు విడుదల చేస్తున్నట్లు టీబీ బోర్డు అధికారులు పేర్కొన్నారు. జలాశయం నుంచి ఉదయం 10 గంటలకు గేట్లు ఎత్తి నీరు విడుదల చేయనున్నట్లు బోర్డు అధికారి తెలిపారు. దామాషా ప్రకారం తొలుత 500 క్యూసెక్కులు విడుదల చేసి, క్రమేపీ 1900 క్యూసెక్కులకు పెంచుతామన్నారు. ఎగువ కాలువను ఆదివారం బోర్డు అధికారులు పరిశీలించారు.

## రానున్న మూడు రోజులు తేలికపాటి వర్షాలు

**బుక్కరాయసముద్రం, జూన్ 21:** అంతర్గత ఒడిసా పరిసర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పలుచోట్ల కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. అనంత, సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఉరుములుతో జల్లులు కురిసే అవకాశముందన్నారు.

## సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించిన ఎస్పీ

**అనంతపురం క్రైం,జూలై 21:** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాల్, పోలీస్ కాంప్లెక్స్, పోలీస్ పెట్రోల్ బంకు, వాటర్ ప్లాంటు, డాగ్‌స్క్వాడ్, జిమ్, ఇండోర్ స్టేడియం, సీపీసీ క్యాంటీన్, రామాలయం, షాదీ ఖానా, ఈ సర్వేలెన్స్ సెంటర్, సైబర్‌సెల్, డయల్-100లను సందర్శించారు. అధికారులు, సిబ్బందితో కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు.



## మహిళా క్రికెట్ పోటీల విజేత సౌత్‌జోన్



విజేత సౌత్‌జోన్ జట్టు

**అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21:** మహిళా క్రికెట్ పోటీల విజేతగా సౌత్‌జోన్ జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చివరి రోజు సీనియర్ మహిళా జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. చిత్తూరు, సెంట్రల్‌జోన్ జట్లు తలపడగా... చిత్తూరు జట్టు 25.5ఓవర్లలో 86పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ 20.3ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కృష్ణా, విశాఖపట్నం జట్లు పోరు జరగగా... కృష్ణా జట్టు నిర్ణీత 50ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 201పరుగులు చేసింది. అనంతరం బరిలోకిదిగిన విశాఖపట్నం 44.3ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అయేషా సింగ్ 100పరుగులు చేసింది. ఫైనల్‌లో నార్త్, సౌత్‌జోన్ జట్లు పోటీ పడగా.. సౌత్‌జోన్ నిర్ణీత 50ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసింది. అనూష 94, ఐశ్వర్య 85 పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన నార్త్‌జోన్ 40.4 ఓవర్లలో 138పరుగులకు ఆలౌటైంది. దీంతో పాయింట్ల ఆధారంగా సౌత్‌జోన్ జట్టు విజేతగా, విశాఖపట్నం రన్నరప్‌గా నిలిచింది. ఏసీఏ మహిళా క్రికెట్ జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ చైర్మన్ ప్రసాద్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధుఆచారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు హుస్సేన్, తులసిరామ్ లక్ష్మి, దివ్య, కోచ్‌లు పాల్గొన్నారు.

### రేపు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23వతేదీన ఆర్డీటీ స్టేడియంలో జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా సీఈఓ వెంకటేశులు, అధ్యక్ష, కార్యదర్శులు హర్షవర్ధన్, నాగేంద్ర తెలిపారు. 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు జూనియర్ విభాగానికి అర్హులన్నారు. అర్హతగల క్రీడాకారులు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన సీనియర్ జట్టు ఆగస్టు 10వతేదీ నుంచి వినుకొండలో, జూనియర్ జట్టు ఆగస్టు 17వతేదీ నుంచి శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తాయని తెలిపారు. వివరాలకు నంబరు 7989017210ను సంప్రదించాలని కోరారు.

### 24 వరకు ఐటీఐ ప్రవేశాల రిజిస్ట్రేషన్

**అనంతపురం సెంట్రల్, జూలై 21:** ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి సమీపంలోని ఐటీఐ కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వారికి 27న ప్రభుత్వ ఐటీఐలలో, 29న ప్రైవేట్ ఐటీఐలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

### టమోటా కిలో రూ.56

**అనంతపురంరూరల్, జూలై 21:** కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.56తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.26 పలికినట్లు ఆయన తెలిపారు.

### నేటి నుంచి స్కూళ్లలో 'శిక్షాసప్తాహ్'

**అనంతపురం విద్య, జూలై 21:** జిల్లాలోని అన్ని స్కూళ్లలో 22వ తేదీ నుంచి శిక్షా సప్తాహ్ నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ రోజుల్లో స్కూళ్లలో బోధన సామగ్రి తయారీ, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలన్నారు. డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖాధికారులు ప్రధానోపాధ్యాయుల ద్వారా శిక్షా సప్తాహ్ విజయవంతం చేయాలని సూచించారు.

## వైభవంగా గాలెమ్మ జాతర


అలంకరణలో అమ్మవారు

గార్లదిన్నె, జూలై 21: మండలంలోని కల్లూరు పం చాయతీ ఎగువ పల్లి గ్రామం లో ఆదివారం గాలెమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల ఇలావేల్పు దేవతగా విరాజిల్లుతున్న గాలెమ్మ అమ్మవారి జాతరను కులమతాలకు అతీతంగా ప్రతి ఏడాది ఆషాఢమాసంలో మూడవ వారం నిర్వహించడం ఆనాయితీగా వస్తోంది. జాతర సందర్భంగా రెండు రోజుల నుంచి దేవాలయాన్ని విద్యుద్దీపకాంతులతో అలంకరించారు. ఉదయం గ్రామంలో భక్తులు అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించి దర్శించుకున్నారు. జాతర సందర్భంగా యువకుల సహకారంతో కబడ్డీ పోటీలు నిర్వహించారు. 30 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో ప్యాపిలి జట్టు మొదటి స్థానంలో నిలవగా వీరికి రూ.20వేలు, రాప్తాడు జట్టు రెండో బహుమతి గెలుపొందగా రూ.15వేలు, తాడిపత్రి జట్టు మూడవ బహుమతి గెలుపొంది రూ.10వేలు అందజేశారు.


అమ్మవారికి బోనాలు మోసుకెళుతున్న భక్తులు

## ఘనంగా వ్యాసమహర్షి జయంతి


శంకరాచార్యుల నగరోత్సవం నిర్వహిస్తున్న వేదపాఠశాల విద్యార్థులు

అనంతపురం కల్చరల్, జూలై 21: భగవాన్ వ్యాస మహర్షి జయంతి వేడుకలను ఆదివారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జగద్గురువు ఆదిశంకరాచార్యులు, దత్తాత్రేయ స్వామి విగ్రహాలకు వేదపండితుడు సుంకేశుల సత్యనారాయణశర్మ, ఆలయ అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం నేతృత్వంలో బ్రాహ్మణ వేదపాఠశాల విద్యార్థులతో అభిషేకాలు, వేదపఠనం చేశారు. అనంతరం పురవీధుల్లో శంకరాచార్యుల నగరోత్సవం చేయడంతోపాటు గోసేవ బృందంచే నృత్యకోలాట ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంతర్రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మఠం ఆనంద్‌కుమార్, రాష్ట్రీయ బజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు భూదేటి అమర్‌బాబు, కార్యకర్తలు కృష్ణకుమార్‌గౌడ్, మధుబాబు పాల్గొన్నారు.

## యోగా గురువులకు సన్మానం


గురువులను సన్మానిస్తున్న యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా యోగా గురువుల సేవలను గుర్తుచేసుకున్నారు. గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం స్థానిక రామ్‌నగర్‌లోని కమ్మ భవన్‌లో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, వివేకానంద యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పదేళ్లుగా ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సుధాకర్ మూర్తి, గురు రాజారావు, సదాశివన్, రామాంజనేయులు, మారుతిప్రసాద్, ఆంజనేయులు, దివాకర్, పుల్లయ్య, వెంకటేశ్వరగుప్తాలను సన్మానించారు. యోగా ద్వారా ఆరోగ్యభద్రత, మానసిక ఆనందం కలుగుతాయని, యోగా ప్రాధాన్యతను వివరించారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, సుధాకర్ బాబు, మాసినేని రామయ్య, నారాయణ, శ్యామ్‌సుందర్ శాస్త్రి, యోగా గురువులు పాల్గొన్నారు.

## ఉచిత గుండె వైద్య పరీక్షలు


పాతూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనంతపురం అర్బన్/రూరల్, జూలై 21: నగరంలోని పాతూరు కస్తూర్బా పాఠశాల సమీపంలోని సచివాలయంలో టీడీపీ నాయకులు, 12వ డివిజన్ కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం గుండె జబ్బుల రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 180 మందికిపైగా జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీఎకో పరీక్షలు నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తన చుట్టూ తిరగడం కంటే ప్రజలకు సేవ చేస్తే ప్రయోజనం ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశానన్నారు. నాయకులు కుమార్, రమేష్, నాగభూషణం, మంజు, రవి, మహేష్ పాల్గొన్నారు.

## సంఘాలను భాగస్వామ్యం చేయాలి

అనంతపురం విద్య, జూలై 21: విద్యారంగాభివృద్ధిలో ఫోర్టో సంఘాలను భాగస్వామ్యం చేయాలని విద్యాశాఖ మంత్రికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధానకార్యదర్శి కొండయ్య ఆదివారం ప్రకటనలో కోరారు. ఫోర్టో యూనియన్‌లో నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ), ఎస్ఎల్‌టీఏ, ఏపీఎస్ఏపీఈఏ, పీఎస్‌హెచ్ఎంఏ, బీసీటీయూ,ఎస్‌జీఎఫ్ఎఫ్ వంటి 16 రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలు కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ వైఖరివల్ల రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఫోర్టో సంపూర్ణ భాగస్వామ్యం అందిస్తుందన్నారు. ఫోర్టో భాగస్వామ్య సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు.

## రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21: రక్తదానం చేయండి...ప్రాణదాతలు కండని యువత పిలుపునిచ్చింది. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మై గవర్నమెంట్, డిజిటల్ ఇండియా ప్రోగ్రాం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానశిబిరం నిర్వహించారు. జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా దాతల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని, యువతలో మానవతా విలువలు పెరుగుతాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ గోపీనాథ్, కేంద్రప్రభుత్వ మై గవర్నమెంట్ అంబాసిడర్ బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగశుభ, మురళీకృష్ణ, నందిత, పవన్, కిరణ్‌సాయి, గణేష్, శివ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

# అంబరాన్నంటిన గురుపౌర్ణమి సంబరాలు

● సాయిమందిరాలకు పోటెత్తిన భక్తులు
● మార్మోగిన సాయినామం

అనంతపురం కల్చరల్, జూలై 21: గురువులకు గురువైన సాయినాథుడిని స్మరించుకుంటూ ఆదివారం జిల్లావ్యాప్తంగా గురుపౌర్ణమి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తడంతోపాటు సాయినామస్మరణతో భక్తిపారవశ్యం పొందారు. జిల్లాకేంద్రంలోని సాయిమందిరాల వద్ద స్వామివారి దర్శనంకోసం భక్తులు బారులుతీరారు. పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, కాగడహారతులు, పల్లకీసేవలతో భక్తులు తరించిపోయారు. మూడవరోడ్డులోని షిర్డీసాయి ఆలయంలో సాయినాథునికి వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యవర్గం ఆయనకు సాయిబాబా చిత్రపటం అందజేసి సత్కరించారు. సాయంత్రం సాయినాథున్ని పల్లకిలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకోరోత్సవం చేశారు. వేణుగోపాల్‌నగర్‌లోని సద్గురు సాయినాథమందిరంలో ఉదయం పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. భక్తులచే సమీకరించిన దాదాపు రూ.50లక్షలు విలువ చేసే స్వర్ణ కిరీటాన్ని సాయినాథుని మూలవిరాట్‌కు అలంకరించి పూజాదులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య స్వామివారిని దర్శించుకోగా ఆయనకు ఆలయ కార్యవర్గం చేతులమీదుగా స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా వున్న ఆలయంలో పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. చెరువుకట్టమీద వెలసిన ఆలయంలో సాయినాథునికి వివిధరకాల పుష్పాలతో నయనమనోహరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రామచంద్రనగర్‌లోని షిర్డిసాయిబాబా మందిరంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. అలాగే హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి ఆలయ ఆవరణలో ఉన్న షిర్డిసాయి ఆలయం, వలీస్వామి ఆశ్రమం, హౌసింగ్‌బోర్డులోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని బాబా మందిరం, అరవిందనగర్‌లోని సత్యసాయి కళ్యాణమండపం, శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమం, లక్ష్మీనగర్‌లోని సాయిమందిరం ఇలా అన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. శారదానగర్‌లోని శంకరమఠంలో శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలవద్ద పెద్దఎత్తున భక్తులకు అన్నదానం చేశారు.

**శింగనమల:** మండల కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు చెరువు కట్టపై వెలసిన సాయి మందిరంలో ఆదివారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు

**రామగిరి:** మండల కేంద్రంలో షిర్డీసాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బాబా విగ్రహానికి పురోహితుడు శివ పాలాభిషేకం, పుష్పాభిషేకం, గణపతిహోమం, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

**గార్లదిన్నె:** మండలంలోని గార్లదిన్నె, కల్లూరు, కోటంక తదితర గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం షిర్డిసాయిబాబను వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**బుక్కరాయసముద్రం:** మండల కేంద్రంలోని చెరువుకట్టపై ఉన్న షిర్డిసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకుజామున నుంచే బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చెన్నంపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు మల్లిఖార్జునరెడ్డి అధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలుతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

**నార్పల:** మండల కేంద్రంతో పాటు బొందలవాడ, పప్పూరు, తదితర గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకులు ఘనంగా నిర్వహించారు. బొందలవాడ గ్రామంలోని సప్తగిరీష షిర్డీసాయి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలం నరసానాయుడు, ఆలం వెంకటనరసానాయుడు, ఆలం వెంకటరమణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


**ధర్మవరంరూరల్(కనగానపల్లి):** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మామళ్లపల్లిలోని షిర్డీసాయి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాతపాళ్యం గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో గురుపౌర్ణమి ఆరాధానోత్సవాన్ని నిర్వహించారు. పీఠాధిపతి గురువు కుళ్లాయిరెడ్డిస్వామి, శిష్యుడు రామయ్యస్వామి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, గంగ, గోపూజ నిర్వహించారు.


రామగిరిలో అలంకరణలో సాయినాథుడు


శింగనమలలో...


గార్లదిన్నెలో...


నార్పలలో..


కనగానపల్లిలో...


వేమన టెలిఫోన్ భవన్ వద్ద సాయినాథుడి మందిరంలో అలంకరణ


దర్శనానికి బారులుదీరిన భక్తులు


సాయి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

## కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 21: ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలకు ఉపయోగపడే పలు కంప్యూటర్ కోర్సుల శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ ఓబిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ ఆటోమేషన్, పీసీ మెయింటెన్స్ అండ్ ట్రబుల్ షూటింగ్, ఆటోకార్డ్, క్రాఫ్ట్ కోర్సులైన యోగా, బ్యూటీషియన్ వంటి కోర్సులకు ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో తమ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. టెన్త్, ఇంటర్, ఇతర ఉన్నత విద్యార్హతలున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 22వ తేదీ నుంచి వచ్చే నెల 17వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు ఉందన్నారు. శిక్షణ తర్వాత ఈ ఏడాది అక్టోబరులో పరీక్షలు ఉంటాయని తెలిపారు. పాసైన వారికి ఎస్‌బీటీఈటీ ద్వారా సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లోని తమ ఆఫీస్‌లో కానీ 9059723829, 7569033379 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## లెజెండరీ, నంది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూలై 21: 2024 సంవత్సరానికి సంబంధించి వివిధ రంగాల్లోని ప్రతిభావంతులు, విశేష సేవలందించిన ప్రముఖులకు ఆగస్టు 10వ తేదీన అందించే లెజెండరీ, నంది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సరోజమ్మ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు స్మారక దినాన్ని పురస్కరించుకుని ఆగస్టు 10న ఉదయం గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీత, నృత్య, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం, క్రీడలు, నటన, విద్య, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజిక సేవలు, సాహిత్య, జానపద రంగాలకు చెందిన వారితోపాటు కవులు, కళాకారులు, గాయనీ గాయకులు, సంగీత, నృత్య కళాకారులు, న్యాయవాదులు, సంగీత, నృత్య కళాకారులు, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర రంగాల్లో పనిచేస్తున్నవారు 30వ తేదీలోపు 6302905828 లేదా 9705313061 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## మహిళల అభివృద్ధే ధ్యేయం

● టింబక్టివ్ కలెక్టివ్ అధినేత బబ్లూగంగూలీ

పెనుకొండ రూరల్, జూలై 21: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ అధినేత బబ్లూగంగూలీ, మేరీ వటమట్టం పేర్కొన్నారు. పెనుకొండ సమీపంలోని షీప్ ఫారం వద్ద ఆదివారం గ్రామసిరి కోఆపరేటివ్ సంస్థ 14వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు పెనుకొండ, రొద్దం, రామగిరి, సీకేపల్లి, మండలాల నుంచి దాదాపుగా 400మంది సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో బబ్లూగంగూలీ మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నాలుగు మండలాల్లో గ్రామసిరి సొసైటీ గ్రామీణ వ్యవసాయ కూలీలతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. మహిళల అభివృద్ధి కోసం టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టింబక్టివ్ కలెక్టివ్ సిబ్బంది, గ్రామసిరి కోఆపరేటివ్ సంస్థ అధ్యక్షుడు బీఎన్ సంగప్ప, సీఈఓ తిరుమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొహరం


జలధికి తరలుతున్న పీర్లస్వాములు

రామగిరి, జూలై 21: మండలంలోని పేరూరు గ్రామంలో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. పీర్లస్వాములను అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం గ్రామ పురవీధులలో డప్పువాయిద్యాల నడుమ యువకులు, చిన్నారులు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

## సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

● మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

హిందూపురం అర్బన్, జూలై 21: విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ సూచించారు. కళాశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అనే అంశం పై పట్టణ పరిధిలోని ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్లీనరీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, జోనల్ ప్రధాన కార్యదర్శి ఈటీ రామ్మూర్తి, జిల్లా అధ్యక్షు డు మహేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిశేషు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య


చంద్రమోహన్ (ఫైల్)

పెద్దవడుగూరు, జూలై 21: మండలంలోని కిష్టిపాడు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు చంద్రమోహన్ (37) అప్పుల బాధ భరించలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రమోహన్ పదేళ్లుగా మగ్గం నేస్తుండేవాడు. చేనేత వృత్తిలో నష్టాలు రావడంతో ఇల్లు గడిచేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. అవి రూ.6 లక్షలకు చేరాయి. వాటిని తీర్చేమార్గం కనిపించక తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాసేపటికి చంద్రమోహన్ భార్య భాగ్య ఇంటికి తిరిగొచ్చి చూడగా.. భర్త ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి, చంద్రమోహన్‌ను కిందికి దించారు. అప్పటికే అతడు మరణించాడు. నేతన్నకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పెద్దవడుగూరు ఎస్ఐ రెడ్డెప్ప తెలిపారు.

## అంతర్జాతీయ క్రీడాకారుడికి సన్మానం


ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21: అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ద్వారకనాథ్‌రెడ్డిని ఆదివారం పలు క్రీడాసంఘాల నాయకులు సన్మానించారు. శ్రీలంకలో ఏషియన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహించి, తిరిగి నేషనల్ శిక్షణ శిబిరానికి ఎంపికైన ద్వారకనాథ్‌రెడ్డిని ఆదివారం స్థానిక అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సన్మానించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి, రామ్‌కుమార్, మురళీకృష్ణ, బలరాం, కోచ్ వెంకటేష్, వేణుగోపాల్ నాయుడు, కేశవనాయుడు, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

## పశువుల సంత ఆదాయం రూ.3.06 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,06,210 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,91,140, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,15,070 వచ్చిందని తెలిపారు.

## దానిమ్మ చెట్లకు గడ్డి మందు పిచికారీ

● వాడిపోయిన చెట్లు, కాయలు


వాడిపోతున్న దానిమ్మ చెట్లు

శింగనమల జూలై21: మండలంలోని మదిరేపల్లి గ్రామానికి చెందిన రైతు రాయపాటి నవీన్‌కుమార్‌కు చెందిన 800 దానిమ్మ చెట్లకు గడ్డి మందులు పిచికారి చేయడంతో కాయలు చెట్లు వాడిపోయాయి. రైతు రాయపాటి నవీన్ కుమార్ చెన్నవరం పొలంలోని రెండు ఎకరాలో 800 దానిమ్మ చెట్లు రెండు సంవత్సరాలు కిందట సాగు చేశారు. ఈ ఏడాది చెట్లు కాపు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి తోటపై గడ్డి మందు పిచికారి చేయడంతో రెండురోజుల నుంచి చెట్ల ఆకులు, కాయలు వాడిపోతున్నాయని రైతు వాపోయాడు. రూ.3లక్షలు వరకు నష్టం వాటిల్లిందని విలపించాడు. బాధిత రైతు శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నాగరాజు మృతదేహం

ధర్మవరంరూరల్(కనగానపల్లి), జూలై21: మండలంలోని యలకుంట్ల గ్రామసమీపంలో వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నెమలివరం గ్రామానికి చెందిన నాగభూషణం కుమారుడు మల్లెల నాగరాజు(25) ఆదివారం తమ బంధువులు ఉజ్జినప్ప వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు వేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు యువకుడు విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక రైతులు గుర్తించి యువకుడి కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు విగతజీవిలా పడిఉన్న అతనిని చూసి రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచివేసింది. కనగానపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అట్టహాసంగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

గార్లదిన్నె, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు రాతిదూలం లాగుడు పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఆదివారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని టీడీపీ నాయకుడు గేట్‌క్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో జనరల్ విభాగం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలకు అనంతపురం జిల్లా తో పాటు బళ్లారి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదట షిర్డీసాయిబాబును దర్శించుకుని పోటీలను కేశవరెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు భారీస్థాయిలో వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

**అఖండ ఎద్దు విజయం:** గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీల్లో గార్లదిన్నెకు చెందిన కుమ్మర రామాంజనేయులు ఎద్దులు 3269.9 అడుగులు లాగి మొదటి బహుమతి గెలుపొందాయి. ఈ ఎద్దుల్లో ఒకటి ఎమ్మెల్యే బాలకృష్ణ నటించిన అఖండ సినిమాలో బసవా అనే పేరున్న ఎద్దు ఉంది. నంద్యాల జిల్లా పీఆర్‌పల్లికి చెందిన తోటశివ ఎద్దులు 3250 అడుగులు లాగి రెండో బహుమతి గెలుచుకున్నాయి. గార్లదిన్నెకు చెందిన కుమ్మర రమేష్ ఎద్దులు 3108 అడుగులు లాగి మూడో బహుమతి గెలుచుకున్నాయి. ఆత్మకూరు మండలం చెన్నప్ప ఎద్దులు 3వేల అడుగులు లాగి నాల్గవ, అనంతపురానికి చెందిన ఓబుళపతి ఆచారీ ఎద్దులు ఐదవ బహుమతి గెలుచుకున్నాయి. మొదటి బహుమతి గెలుచుకున్న ఎద్దులకు కేశవరెడ్డి రూ. 50వేలు, రెండో బహుమతిని మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి రూ. 40వేలు, మూడో బహుమతి మాజీ జడ్పీటీసీ విశాలాక్షి రూ. 30వేలు, నాల్గవ బహుమతి మహా కూటమి బృందం పవన్, శీనా రూ.20వేలు, 5వ బహుమతి మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌నాయుడు రూ.10వేలు అందచేశారు. గుర్రం ఆదినారాయణ, అనిల్‌కుమార్‌చౌదరి, ఇల్లూరు రామాంజి, వడ్డేవన్నూర్, గుత్తా బాలకృష్ణ, గుండాల రమణరెడ్డి, పుల్లన్న, వడ్లరాము, వెంకట్రామిరెడ్డి, నరసింహారెడ్డి, చితంబరప్ప, బాబయ్య, సురేంద్ర, కొడిదల రామకృష్ణ, కొడిదల శీనా, రామాంజి, సంగప్ప, చలపతి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కేశవరెడ్డి, రామలింగారెడ్డి, శేఖర్

## చికిత్స పొందుతూ వెలుగు సీసీ...


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ, ఏసీ, తదితరులు

చెన్నేకొత్తపల్లి, జూలై 21: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ డీఆర్‌డీఏ వెలుగు సీసీ శనివారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన కె.ఆనంద్‌కుమార్(47) చెన్నేకొత్తపల్లి మండల సమాఖ్యలో సీసీగా పనిచేసేవాడు. ఈయన శనివారం సీకేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయంతెలిసిందే. మొదట చికిత్స నిమిత్తం అనంతపురానికి అక్కడి నుండి కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారన్నారు. ఆనంద్‌కుమార్‌కు భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏరియా కో ఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం అనసూయ తోటి వెలుగు సీసీలు, సిబ్బంది ఆదివారం మామిళ్లపల్లికివెళ్లి ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

● షిర్డీ సాయి ఆలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు
● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

**ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్:** గురుపౌర్ణమి వేడుకలు గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఉన్న షిర్డీసాయి బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు బాబాకు మహాగణపతి పూజ, కాగడ హారతితో పాటు పలు అభిషేకాలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. తర్వాత ప్రత్యేకపూజలు, అర్చనలు, మహామంగళహారతి కార్యక్రమాలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు అన్నదానం చేపట్టారు. సాయంత్రం పల్లకీలలో బాబా చిత్రపటాలను, ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పలు ఆలయాల వద్ద కళాకారులు చేపట్టిన కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. తాడిపత్రిలోని సంజీవనగర్‌లో గల షిర్డీ ఆలయంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి దంపతులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ దంపతులు బాబాను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అలాగే కణేకల్లు, రాయదుర్గంలోని సాయిబాబా ఆలయాల్లో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. గుంతకల్లు పట్టణంలోని బాబా ఆలయంలోని వేడుకల్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా వివిధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.


తాడిపత్రిలోని సంజీవనగర్‌లో ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి


ఉరవకొండలో..


యల్లనూరులో ..


నగరూరులో..


బెళుగుప్పలో ..


కూడేరులో..


వజ్రకరూరులో సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు


నక్కలపల్లిలో ఆలయం వద్ద కోలాటం


బెళుగుప్ప ఆలయం వద్ద భక్తులకు అన్నదానం


గుత్తిలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు


రాయదుర్గంలో షిర్డీబాబా సేవలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


తాడిపత్రిలో షిర్డీసాయి ఆలయంలో జేసీపీఆర్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు


తాడిపత్రిలో ప్రసాదం అందుకుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ దంపతులు


గుంతకల్లులో షిర్డీబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు

## జేసీపీఆర్‌ను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు

**తాడిపత్రి, జూలై 21:** మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ఆదివారం తాడిపత్రిలో కలిశారు. గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొనేందుకు వెంకటశివుడుయాదవ్ తాడిపత్రికి వచ్చారు. వేడుకల అనంతరం ఆయన జేసీ ప్రభాకర్‌రెడ్డిని కలిసి అరగంట సేపు మాట్లాడారు. తాడిపత్రి, జిల్లా రాజకీయాల గురించి వీరి మధ్య ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది.


జేసీ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

## కల్వర్టు పనుల పరిశీలన

**కణేకల్లు, జూలై 21:** మండలకేంద్రంలోని చిక్కణ్ణేశ్వరవడియార్ చెరువు వద్ద చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను టీడీపీ మండల నాయకులు పరిశీలించారు. చిక్కణ్ణేశ్వర చెరువు నుంచి నీరు దిగువ వైపునకు వెళ్లేందుకు ఉన్న షెట్టర్ల వద్ద కల్వర్టు ఆరునెలల క్రితం కూలింది. దీంతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకులు కల్వర్టు నిర్మాణపనులను చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కాంక్రీట్ పనులు జరగగా.. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, కురుబ నాగరాజు, చాంద్‌బాషా, మాబుసాబ్, మారెప్ప, ఈరప్ప తదితరులు పరిశీలించారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

## ద్విచక్రవాహనం చోరీ

**బొమ్మనహాళ్, జూలై 21:** మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామానికి చెందిన శివారెడ్డి ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. శివారెడ్డికి చెందిన ద్విచక్రవాహనాన్ని ఎర్రిస్వామి అనే వ్యక్తి శనివారం బొమ్మనహాళ్‌కు తీసుకెళ్లి రాత్రికి అక్కడి తన ఇంటి వద్దనే పార్క్ చేశాడు. కాగా ఆదివారం తెల్లవారుజామున చూసేసరికి ద్విచక్రవాహనం కనపడలేదు. దీంతో తన ఇంటికి ఉన్న సీసీకెమెరాలను పరిశీలించగా అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ విషయంపై ఎర్రిసామి బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.



ద్విచక్రవాహనాన్ని తోసుకెళ్తున్న దుండగుడు

## రక్తదాన శిబిరం

**తాడిపత్రి, జూలై 21:** పట్టణంలోని రోటరీక్లబ్ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు పీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతపురానికి చెందిన రెడ్‌క్రాస్ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 38 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి రఫీ, సభ్యులు, కిషోర్, ఇస్మాయిల్, నవీన్, విక్రమ్, ఖాజా పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

## జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించండి

● వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ, జనసేన నాయకుల వినతి

**బెళుగుప్ప, జూలై 21 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపైన మాట్లాడేలా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మండలకేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి బ్రహ్మసముద్రం మండల టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయిందని, ఈ క్రమంలో జగన్ అసెంబ్లీకి వస్తారో.. రారో అన్న అనుమానాలు కలుగుతున్నాయని, కనుక వచ్చేలా మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ విగ్రహానికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయుడు, నాయకులు నీలాస్వామి, పరమేష్, శివప్ప, బజ్జన్నగౌడు, శివకుమార్, పక్కీరప్ప, శివలింగప్ప పాల్గొన్నారు.


వైఎస్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## చికిత్స పొందుతూ ప్రేమికుడి మృతి

**బొమ్మనహాళ్, జూలై 21:** ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి పెళ్లికి కాదనడంతో పురుగుల మందు తాగిన మనోజ్ రెడ్డి(26) చికిత్స పొందుతూ మృతిచెందాడు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శెట్టూరుకు చెందిన మనోజ్ రెడ్డి, బొమ్మనహాళ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కాగా గత శనివారం అతను ప్రియురాలి ఇంటికి వచ్చి పెళ్లి చేసుకుందామని బతిమిలాడాడు. ఇందుకు ఆ యువతితోపాటు ఆమె కుటుంబసభ్యులు తిరస్కరించారు. దీంతో మనస్తాపం చెందిన అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి వన్నూరురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.


మనోజ్‌రెడ్డి (ఫైల్)

## అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య

**పెద్దవడుగూరు, జూలై 21:** మండలంలోని కిష్టిపాడు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు చంద్రమోహన్ (37) అప్పుల బాధ భరించలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రమోహన్ పదేళ్లుగా మగ్గం నేస్తుండేవాడు. చేనేత వృత్తిలో నష్టాలు రావడంతో ఇల్లు గడిచేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. అవి రూ.6 లక్షలకు చేరాయి. వాటిని తీర్చేమార్గం కనిపించక తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాసేపటికి చంద్రమోహన్ భార్య భాగ్య ఇంటికి తిరిగొచ్చి చూడగా.. భర్త ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి, చంద్రమోహన్‌ను కిందికి దించారు. అప్పటికే అతడు మరణించాడు. నేతన్నకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పెద్దవడుగూరు ఎస్‌ఐ రెడ్డెప్ప తెలిపారు.


చంద్రమోహన్ (ఫైల్)

## వ్యక్తిపై దాడి

**తాడిపత్రి, జూలై 21:** పట్టణంలోని దుర్గారెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి మద్యం మత్తులో మాలిక్ అనే వ్యక్తిపై శివారెడ్డి, బాషా, మహానంది దాడిచేసి గాయపరిచారని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మాలిక్, శివారెడ్డి, బాషా, మహానంది లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరంతా కలిసి మద్యం సేవించడానికి రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ మద్యంమత్తులో మాటమాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో మాలిక్‌పై ముగ్గురు దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

## నిందితుల అరెస్టు

**పెద్దవడుగూరు, జూలై 21:** మండలంలోని వీరన్నపల్లి గ్రామంలో గత శనివారం రెడ్డెప్పరెడ్డి అనే రైతుకు చెందిన మామిడి చెట్లను నరికివేసిన సంఘటనలో ఇదే గ్రామానికి చెందిన గోపాల్, వెంకటస్వామి, శ్రీనివాసులు, నాగభూషణం, రాఘవేంద్రను ఆదివారం అరెస్ట్‌చేసినట్లు ఎస్‌ఐరెడ్డెప్ప తెలిపారు. వీరిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

**విడపనకల్లు, జూలై 21:** మండలంలోని పాల్తూరు గ్రామంలో రైతు వన్నూరప్పకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పాల్తూరుకు చెందిన వన్నూరప్ప ఆదివారం ఉదయం తన ఎద్దులను మేత కోసం సమీపంలోని పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ ఓ ఎద్దు మేత మేస్తూ.. నేలపై తెగి పడి ఉన్న విద్యుత్ తీగలను తాకింది. దీంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన రైతు వెంటనే అప్రమత్తమై గ్రామస్థులకు తెలపటంతో వారు విద్యుత్ సిబ్బందికి చెప్పి కరెంట్ సరఫరాను నిలిపి వేయించారు. రూ.50వేలకుపైగా విలువ చేసే ఎద్దు మృతి చెందటంపై రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఊబిచెర్లలో వ్యక్తి ఆత్మహత్య

**గుత్తిరూరల్, జూలై 21:** మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఊబిచెర్లకు చెందిన కాయల నారాయణస్వామి (50) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తీవ్ర మనోవేదనకు గురైన అతను ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## లారీ ఢీకొని ఒకరి మృతి

**పుట్లూరు, జూలై 21:** మండలంలోని ఏ. కొండాపురం గ్రామ శివారులోగల సబ్‌స్టేషన్ వద్ద శనివారం అర్ధరాత్రి కారును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రి పట్టణానికి చెందిన నీలకంఠ ఆచారి (46) పనినిమిత్తం కారులో అనంతపురానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఏ. కొండాపురం వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిని ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. నీలకంఠ ఆచారి గత ఎన్నికల్లో తాడిపత్రి అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశాడు. అతను పట్టణంలో బంగారుషాపు నిర్వహించడంతో పాటు ఓ పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య అనిత ఉంది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. భార్య ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.


నీలకంఠ ఆచారి (ఫైల్)

## కడవకల్లులో పశువైద్యశిబిరం

**పుట్లూరు, జూలై 21:** మండలంలోని కడవకల్లు గ్రామంలో ఆదివారం పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో పశువైద్యాధికారిణి సువర్ణ పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. అనంతరం పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి సుధాకర్ పశువులకు వేసే సూదుల ధరల గురించి రైతులకు తెలిపారు.

# భీమలింగేశ్వరుడి రథోత్సవాలు ప్రారంభం

**విడపనకల్లు, జూలై 21:** మండలంలోని గడేకల్లు గ్రామంలో వెలసిన భీమలింగేశ్వర స్వామి రథోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు, అర్చకులు శనివారం రాత్రి అంచనహాలు గ్రామం నుంచి స్వామి వారి ఉత్సవవిగ్రహాన్ని పల్లకిలో ఊరేగింపుగా గడేకల్లులోని ఆలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం ఊరి బావిలో గంగ పూజ నిర్వహించి బిందెసేవతో ఊరేగింపు చేపట్టారు. గ్రామవీధుల గుండా సాగిన ఊరేగింపు ఆలయం వద్దకు చేరుకుంది. ఆలయంలో మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు పూజలు నిర్వహించారు. సామవారం సాయంత్రం పంచ కలశాలను రథంపై ఉంచి పూ జలు నిర్వహిస్తామని, మంగళవారం ఉదయం, సాయంత్రం మహారథోత్స వం నిర్వహిస్తామని, అంతటితో వేడుకలు ముగుస్తాయని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


బిందె సేవ ఊరేగింపు చేస్తున్న గ్రామస్థులు, అర్చకులు

## శాకంబరీదేవిగా దుర్గాభవాని


ఉరవకొండలో శాకంబరీదేవి అలంకరణలో దుర్గాభవాని


యాడికిలో శాకంబరీదేవిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి

**ఉరవకొండ, జూలై 21:** పట్టణంలోని దుర్గా భవాని ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటి సభ్యులు అన్నదానం చేపట్టారు.

### కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

**యాడికి:** పౌర్ణమి సందర్భంగా మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఉదయాన్నే అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

## జలధికి తరలిన పీర్లు

**తాడిపత్రి, జూలై 21:** మండలంలోని చుక్కలూరు, బొందలదిన్నె, ఇగుడూరు గ్రామాల్లో పీర్లు ఆదివారం జలధికి తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా ముజావర్లు ఉదయం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తర్వాత సాయంత్రం మరోసారి అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు. అంతకుమునుపు గ్రామస్థులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.


పాతపల్లిలోని బాదుల్లాస్వామి పీరు

### బాదుల్లా స్వామిపీరు ఊరేగింపు

**యల్లనూరు:** మొహరం వేడుకల్లో భాగంగా మండలంలోని పాతపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం బాదుల్లాస్వామి పీరు ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. రెండురోజుల వేడుకల్లో భాగంగా మొదటిరోజు పీరు ఊరేగింపు చేపట్టారు. బాదుల్లాస్వామి పీరుకు ఇంటింటి వద్ద చక్కెర చదివింపులు చేశారు. కార్యక్రమం గ్రామ సర్పంచు ఆధ్వర్యంలో జరిగింది.

## రేపు రేణుకా యల్లమ్మకు బోనాలు

**గుత్తి, జూలై 21:** పట్టణంలోని కోట వీధిలో వెలసిన రేణుకా యల్లమ్మ ఆలయంలో ఈ నెల 23వ తేదీ మంగళవారం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఉదయం 7గంటలకు గంగ పూజ చేసి అమ్మవారికి వడిబియ్యం సమర్పిస్తామన్నారు. అనంతరం గుత్తి కోట ద్వారం నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి పూజలు చేయనున్నట్లు చెప్పారు.

## ఉరవకొండలో గిరిప్రదక్షిణ

**ఉరవకొండ, జూలై 21:** పట్టణంలోని కొండపై వెలసిన బడేసోమేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి భక్తులు ఆదివారం గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత బడేసోమప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. మార్గంలోని మార్కండేస్వామి, రామలింగేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నంజుండేశ్వరస్వామి, గవిసిద్ధేశ్వరస్వామి ఆలయాలను సందర్శిస్తూ 3కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ సాగించారు. ఈ ప్రదక్షిణలో భక్తులు శివనామస్మరణతో ముందుకు సాగారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**పామిడి, జూలై 21 :** పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 35 ఏళ్ల తర్వాత అక్కడే కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పిచ్చాపాటి కబుర్లతో సాయంత్రం వరకు అక్కడే గడిపారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

## అశ్వత్థంలో ప్రత్యేక పూజలు

**పెద్దపప్పూరు, జూలై 21:** గురు పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అశ్వత్థ నారాయణున్ని, భీమలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు పొందారు.



ప్రత్యేక అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి, భీమలింగేశ్వరుడు

## వేరుశనగ పంటకు జింకల బెడద

**రాయదుర్గంరూరల్, జూలై 21:** మండలంలోని ఆవులదట్ల గ్రామ పరిసర ప్రాంతాలలో జింకల బెడద అధికమైనట్లు రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా వేరుశనగ పొలాల్లోకి ప్రతిరోజూ జింకలు గుంపులుగా వచ్చి పంటను మేసి వెళుతున్నట్లు పేర్కొంటున్నారు ఎకరాకు రూ. 10 వేలు చొప్పున ఖర్చు చేసి వేరుశనగను సాగుచేశామని, జింకలు వచ్చి పంటనంతా నాశనం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు ప్రతిరోజూ పగలు, రాత్రి పొలాల వద్దకు కాపలా వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు. అటవీ అధికారులు స్పందించి జింకల నుంచి వేరుశనగ పంటను కాపాడాలని వారు కోరుతున్నారు.

## పొలం విషయంలో ఘర్షణ

**తాడిపత్రి, జూలై 21:** మండలంలోని గంగాదేవిపల్లిలో ఆదివారం మల్లికార్జున, లక్ష్మీనారాయణ పొలం విషయంలో ఘర్షణపడ్డారని రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మల్లికార్జున, లక్ష్మీనారాయణ వరుసకు బావాబావమరుదులు. పొలం విషయంలో వీరిద్దరూ ఘర్షణ పడ్డారు. విడిపించడానికి వెళ్లిన మల్లికార్జున అన్న శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.